సకాలంలో విద్యుత్ సదుపాయాలు కల్పించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

సమీక్షా సమావేశంలో విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జులై 23 : రైతులకు విద్యుత్ సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించకూడదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ రంగంలో విద్యుత్ సరఫరా పురోగతిపై విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేకంగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకున్న వెంటనే నిర్ణీత గడువులోగా విద్యుత్ సదుపాయాలను కల్పించాలని తెలిపారు. రైతులు ఎంతో ఖర్చు పెట్టుకొని బోర్లు వేసుకున్నప్పటికీ సుదీర్ఘకాలంగా విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడంపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్సిడీ వచ్చిన రైతులకు వెంటనే సమాచారం అందించి పనులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాసులను ఆగస్టు 20లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

మండలాలవారీగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్‌లపై కలెక్టర్ ఇంజినీర్లను అడిగి తెలుపుకున్నారు. గృహజ్యోతి పథకం ప్రతి లబ్ధిదారుకు వర్తించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, లబ్ధిదారులకు జీరో బిల్ వస్తుందా.. లేదా అనేది తెలుసుకొని పథకం వర్తించేలా చొరవ చూపాలని ఏఈలను ఆదేశించారు. ప్రతి సోమవారం మున్సిపల్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. కడా కింద చేపట్టే అభివృద్ధి పనులపై పవర్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్‌తో కలిసి నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్షించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

షాబాద్ : నాగరగూడ ఎస్‌బీఐ బ్యాంకులో రుణమాఫీ అయిన రైతుల వివరాలు తెలుసుకుంటున్న రంగారెడ్డిజిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

రుణమాఫీపై ఆందోళన చెందవద్దు

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి
- రుణమాఫీ అయిన రైతులను కలిసిన డీఏవో

మొయినాబాద్, జూలై 23 : రుణమాఫీ విషయంలో అన్నదాతలెవరూ ఆందోళన చెందవద్దని.. అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వస్తుందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు రుణమాఫీపై ఉన్న సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ జరుగుతుందని చెప్పారు. లక్ష లోపు రుణమున్నవారికి రుణమాఫీ జరిగిందని, మిగిలిన వారికి కూడా మాఫీ జరుగుతుందని తెలిపారు. ఆధార్ కార్డు లింక్ సరిగ్గా లేకపోవడం, లక్ష లోపు రుణం తీసుకుని కూడా వడ్డీతో కలిసి లక్షకు పైగా రుణం ఉంటే మాఫీ అయి ఉండకపోవచ్చన్నారు. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేయాలని నిర్ణయించిందని.. రెండు లక్షల లోపు రుణమున్న ప్రతి రైతుకూ రుణమాఫీ జరుగుతుందని పేర్కొన్నారు. రుణమాఫీ విషయంలో ఎలాంటి సందేహాలున్నా ఏవోలు, ఏఈవోలను సంప్రదించాలని ఆమె సూచించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈవోలు కుమార్, సునీల్ పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులు సంతోషం

షాబాద్ : రుణమాఫీపై రైతులు సంతోషం వ్యక్తం చేసినట్లు డీఏవో గీతారెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, ముద్దెంగూడ తదితర గ్రామాల్లో రుణమాఫీ అయిన రైతులను కలిసి మాట్లాడారు. అనంతరం నాగరగూడ ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించారు. రుణమాఫీ అయిన రైతుల క్రాప్ లోన్ రెన్యువల్ గురించి బ్యాంకు మేనేజర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి విడత రుణమాఫీతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. ఏకకాలంలో వానకాలంలో రుణాలను మాఫీ చేసినందున, మళ్లీ రుణాలను రెన్యువల్ చేసుకొని వ్యవసాయ పనులకు వాడుకుంటామని రైతులు చెప్పినట్లు డీఏవో తెలిపారు.

ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈవోలు రాజేశ్వరి, గీత, మాజీ ఎంపీటీసీ పాండు ఉన్నారు.

పట్టు పురుగుల పెంపకంతో మంచి లాభాలు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజాగాంధీ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజాగాంధీ

యాచారం, జూలై 23 : పట్టు పురుగుల పెంపకంతో మంచి లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజాగాంధీ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో చేపట్టిన పట్టుపురుగుల పెంపకాన్ని అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పట్టు పురుగుల పెంపకం, కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. పంటల సాగు, సస్య రక్షణ, చీడపీడల నివారణపై రైతులకు అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజాగాంధీ మాట్లాడుతూ.. మండలంలో పట్టు పరుగుల పెంపకం, ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఆమె కోరారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉన్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పంటల సాగుకు రైతులకు సబ్సిడీ కింద డ్రిప్, మల్చింగ్, మొక్కలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో హార్టికల్చర్ అధికారుల సలహాలు, సూచనల మేరకు కూరగాయలు, ఆయిల్‌పామ్, పట్టు పరుగుల పెంపకానికి రైతులు ముందుకొచ్చి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కేంద్రీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ హార్టికల్చర్ శాస్త్రవేత్త కృష్ణారెడ్డి, మండల హార్టికల్చర్ అధికారి కనకలక్ష్మి, ఉద్యాన సహాయక సంచాలకుడు సంజయ్‌కుమార్, ఆయిల్‌పామ్ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్, మండల స్థాయి అధికారులు విక్రమ్, విష్ణు, హార్టికల్చర్ అధికారి నవీన ఉన్నారు.

కంది పంటలకు గొడ్డు తెగులు

హస్నాబాద్‌లో కందిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొడంగల్, జూలై 23 : కందిపంటకు గొడ్డు తెగులు (స్టిరిలిటీ మొజైక్) సోకుతున్నదని, రైతులు జాగ్రత్తపడి తెగులు నివారణ చర్యలు చేపట్టాలని కందిపంట ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సుధాకర్, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డా.లక్ష్మణ్‌తో పాటు డా.యమునారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హస్నాబాద్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని కంది పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. కందిపంటకు గొడ్డు తెగులు(స్టిరిలిటీ మొజైక్)ను గమనించడం జరిగిందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెగులు వారం రోజుల్లో ఉధృతంగా వ్యాప్తి చెందే గుణం కలిగి ఉందన్నారు. గొడ్డు తెగులును త్వరగా నివారించుకోవాలని.. లేదంటే పంట దిగుబడి తగ్గి అపార నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ వ్యాధిని త్వరగా నివారించుకోవాలని, వ్యాధి సోకిన పొలంలోని కంది మొక్కలను పూర్తిగా ఏరి వేయాలని సూచించారు. ఆరోగ్యమైన మొక్కలను కాపాడుకునేందుకు డైకోఫాల్ మందును 3 నుంచి 5 గ్రాములు, లీటర్ నీటిలో లేదా వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిసి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మళ్లీ వారం రోజుల్లో మరోమారు పిరికారీ చేసుకోవడం వల్ల తెగులును నివారించుకోవచ్చని సూచించారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఈవో పావని పాల్గొన్నారు.

దౌల్తాబాద్ మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ తల్లికి బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాన్ని అలంకరించుకొని గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. ఆలయం చుట్టూ బోనంతో మహిళలు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించారు.
– కొడంగల్, జూలై 23

కూల్చివేతతో వివాదాస్పదం

- వెంటనే స్పందించిన పోలీసులు, ఇతర అధికారులు

మొయినాబాద్, జూలై 23 : పురాతన ప్రార్థనా మందిరాన్ని కూల్చివేసిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. మొయినాబాద్ మండల పరిధి చిలుకూరు గ్రామ రెవెన్యూలో సర్వే నం.133లో ప్రార్థన మందిరానికి సంబంధించిన 300 ఏండ్ల పురాతన నిర్మాణం ఉన్నది. ఆ ప్రార్థన మందిరం చుట్టూ ప్రైవేట్(ఎన్ఆర్ఐ) వ్యక్తికి సంబంధించిన పట్టా భూమి ఉన్నది. ఆ భూమిని చదును చేస్తున్న క్రమంలో ఆ పురాతన భవనాన్ని సోమవారం రాత్రి కూల్చివేశారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు వక్ఫ్‌బోర్డు అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ముస్లిం సోదరులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్సీ రహమత్ బేగ్, తెలంగాణ రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఫహీంఖురేషీ సోమవారం రాత్రి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అక్కడికి రాగా.. రహమత్‌బేగ్, ఖురేషీ ప్రార్థనామందిరం కూల్చివేతపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిస్థితి చేజారకుండా సైబరాబాద్ సీపీ ఆదేశాల ప్రకారం డీసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆందోళనకారులను శాంతింపజేసి పరిస్థితిని చక్కదిద్దారు. సమన్వయం పాటించాలని మత పెద్దలు సూచించారు. ఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ గౌతంకుమార్ కూల్చివేతకు ఉపయోగించిన రెండు జేసీబీలలో ఒక జేసీబీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కూల్చివేతకు కారకులైనవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రార్థనా మందిరానికి చెందిన స్థలాన్ని వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తహసీల్దార్ ఆ భూమిని సర్వే చేసి 4 గుంటల భూమి వక్ఫ్ బోర్డు భూమిగా తేల్చిచెప్పారు. దీంతో భూమి హద్దులు ఏర్పాటు చేసి అక్కడ బోరు వేసి షెడ్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ ఘటన వివరాలను వెల్లడించారు. తప్పు చేసినవారిని చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు.

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

- రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

ప్రార్థనా మందిరానికి సంబంధించిన పురాతన నిర్మాణాన్ని కూల్చినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ప్రార్థనా మందిరాన్ని కూల్చారని ఫిర్యాదు చేసిన వెంటనే ఘటనా స్థలానికి ముసిం మత పెద్దలు, స్థానిక నాయకులతో కలిసి సోమవారం రాత్రి 11 గంటలకు చేరుకున్నాం. అక్కడ ప్రార్థనా మందిరం ఉన్నట్లుగా గుర్తించాం. ఒక ఎన్ఆర్ఐకు సంబంధించిన భూమి మధ్యలో సర్వే నం.133లో ప్రార్థనా మందిరం ఉన్నది. ఎన్ఆర్ భూమిని చదును చేసే పనులను ఒక వ్యక్తికి అప్పగించగా అతను చదును చేస్తున్న క్రమంలో ప్రార్థన మందిరాన్ని కూల్చివేసినట్లుగా గుర్తించాం. ఈ విషయాన్ని ఎన్ఆర్ఐకి చేరవేశాం. అతడి ఇంటికి కూడా పోలీసులను పంపించాం. పెద్ద సెక్షన్ కింద కేసు నమోదు చేశాం. ఆలస్యం చేయకుండా కూల్చివేతకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేస్తాం. ఎవరు కూడ తొందరపడవద్దు. తప్పు చేసినవారిని చట్టపరంగా శిక్షిస్తాం.

కబ్జా చేస్తే ఎవరినీ వదిలిపెట్టం

- గౌతంకుమార్, తహసీల్దార్

ప్రభుత్వ భూములను కానీ, వక్ఫ్ బోర్డు భూములను కాని ఎవరు కబ్జా చేసే ప్రయత్నం చేసినా ఎంతటివారినైనా వదిలి పెట్టకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రార్థనా మందిరాన్ని కూల్చివేశారనే విషయం తెలియగానే సోమవారం రాత్రి 12.30కిఘటనా స్థలానికి చేరుకున్నాం.మంగళవారం ఉదయం మళ్లీ చేరుకుని ప్రార్థనా మందిరానికి సంబంధించిన భూమిని సర్వే చేయగా 4 గుంటల భూమి ఉన్నది. రికార్డులో కూడా వక్ఫ్ బోర్డు భూమి అని ఉంది. పోలీసుల పహారాలో సర్వే చేశాం. ఎవరైనా వక్ఫ్ బోర్డు భూమిని కాని, ప్రభుత్వ భూమిని కాని కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఎవరిరీ వదిలి పెట్టేది లేదు.

జాతీయ నాటకోత్సవాల్లో కళాకారులకు బహుమతులను అందజేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, సభ్యులు

ముగిసిన జాతీయస్థాయి నాటకోత్సవాలు

పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన బాలలు

షాద్‌నగర్‌రూరల్, జూలై 23 : షాద్‌నగర్‌లో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయస్థాయి నాటకోత్సవాలు మంగళవారం నాటితో ముగిసాయి. ఈ నాటకోత్సవాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రతిభ కనబర్చారు. అంతరించిపోతున్న కళారంగాని పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేసిన సంస్కార భారతి, నవ కళాభారతి సభ్యులను మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు కళారంగంలో రాణించడం సంతోషకరమన్నారు. మాకు స్వాతంత్ర్యం కావాలి, ప్రపంచ తంత్రం, నమస్కార్ జీ నమస్కార్, బాల భారతం వంటి నాటకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ నాటకోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని నాటకోత్సవాల డైరెక్టర్ టీవీ రంగయ్య తెలిపారు. కళాకారులను గుర్తించడంతోపాటు అంతరించిపోతున్న నాటకాల కళకు పూర్వవైభవం తీసుకురావాలని ప్రభుత్వాన్ని, కళాకారులను ఆయన కోరారు. నాటకోత్సవాలకు సహకరించిన సభ్యులు, కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాకారులకు బహుమతులను అందజేశారు.

పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

వికారాబాద్ డీఏవో గోపాల్

కులకచర్ల, జూలై 23 : వానకాలం పంటల వివరాలను ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల పరిధి విఠలాపూర్ గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవడం ద్వారా మార్కెట్‌లో విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి తగిన మోతాదులో ఎరువులు, మందులను వాడాలని సూచించారు. అధిక వర్షాల వల్ల నేలలో భాస్వర లోపం ఏర్పడి మొక్కలు ఊదా రంగులోకి మారే అవకాశం ఉందన్నారు. అర్హులైన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి బీమా చేయించుకోవాలని డీఏవో సూచించారు.

విఠలాపూర్‌లో పంట పొలాలను పరిశీలిస్తున్న వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

5,180 కేజీల నల్ల బెల్లం పట్టివేత

పెద్దేముల్, జూలై 23 : నాటుసారా తయారీకి వినియోగించే 5,180 కేజీల నల్ల బెల్లాన్ని కర్ణాటక రాష్ట్రం నుంచి వికారాబాద్ జిల్లాకు తరలిస్తుండగా డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు మెరుపుదాడి చేసి మంగళవారం పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం నుంచి ముగ్గురు వ్యక్తులు ఓ వాహనంలో నాటుసారా తయారీకి అవసరమైన నల్ల బెల్లాన్ని వికారాబాద్ జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు ఓమ్లానాయక్‌తండా శివారులో మెరుపుదాడి చేసి ఆ వాహనాన్ని పట్టుకున్నారు. నల్లబెల్లం సుమారు 5180 కేజీలు ఉంటుందని.. బెల్లంతోపాటు నాటుసారా లిక్కర్‌నూ స్వాధీనం చేసుకున్నారన్నారు. ముగ్గురు వ్యక్తులు కర్ణాటకలో నల్లబెల్లాన్ని రూ.40 కిలో చొప్పున కొని దానిని తెలంగాణలో రూ.60 నుంచి రూ.100 వంద వరకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని.. పట్టుబడ్డ నల్ల బెల్లం విలువ సుమారు రూ.4,14,000 వరకు ఉంటుందన్నారు. వాహనాన్ని సీజ్ చేసి.. నిందితులు రాథోడ్ పాండూనాయక్, రాథోడ్ ఓంసింగ్, రాథోడ్ సచిన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పాండూనాయక్ గతంలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు రికార్డుల్లో ఉందన్నారు. ఈ దాడుల్లో జిల్లా డీటీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్, ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు సీఐ గంగాధర్, సిబ్బంది విష్ణు, హన్మంతు, శివ, రవికుమార్ పాల్గొన్నారు.

దాని విలువ రూ.4,14,000

- ముగ్గురు నిందితుల అరెస్టు, వాహనం సీజ్
- కర్ణాటకలో తక్కువకు కొని ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయం
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ గౌడ్


నందిగామ మండలంలోని కన్హా శాంతివనాన్ని మంగళవారం భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన కేంద్రమైన హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి ధ్యానం చేశారు. – నందిగామ, జూలై 23

మొక్కలు నాటేందుకు స్థల నిర్ధారణ

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం జరుగుతున్నదని జిల్లా స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లో వనమహోత్సవంలో భాగంగా భృంగీ కాలనీలో పర్యటించారు. స్థల నిర్ధారణ చేసి గుంతలు తీయించారు. 250 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఉన్నారు.
– వికారాబాద్, జూలై 23

రియల్ రంగం మరింత పురోగమించేలా..

క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి

సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): మౌలిక వసతులు, గృహ, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా పట్టణాభివృద్ధి ప్రణాళికలు, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వంటి చర్యలతో రియల్ ఎస్టేట్ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో సముచిత స్థానం దక్కిందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ తీరుతెన్నులు, ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ రంగానికి ఉన్న ప్రాధాన్యతల గురించి క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ జగన్నాథ రావు మీడియాతో చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను క్రెడాయ్ స్వాగతిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దేశంలో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, రెవెన్యూ సంస్కరణలన్నీ కూడా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహిస్తాయన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0లో భాగంగా రూ.10 లక్షల కోట్లతో పట్టణ పేద, మధ్యతరగతి వర్గాలకు కోటి ఇండ్ల నిర్మాణం ఈ రంగానికి ఊపునిస్తుందన్నారు. అదే విధంగా పన్ను రేట్ల సరళీకరణ, క్యాపిటల్ గెయిన్స్ పన్ను తగ్గింపు, ఆస్తి విలువల సూచిక సవరణ వంటి అంశాలు రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి సహకరిస్తుందని జనరల్ సెక్రటరీ జగన్నాథరావు అన్నారు. ప్రధానంగా పన్ను రేట్ల తగ్గింపు నగర రియల్ రంగంపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. హైదరాబాద్ –బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌లో పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. అయితే, ఈ బడ్జెట్‌లో ఆఫర్డబుల్ ఇండ్ల కేంద్రం ఇచ్చే ప్రత్యేక ప్రోత్సాహకాలతో సామాన్యుడి సొంత కల మరింత సులభతరం అవుతుందన్నారు.

ఓమ్లానాయక్ తండా గ్రామ శివారులో పట్టుబడ్డ నిందితులు, నల్ల బెల్లం, వాహనాన్ని చూపిస్తున్న వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ గౌడ్, ఇతర సిబ్బంది